సాక్షి ఖమ్మం

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



ముందు బిల్లులు ఇవ్వండి..

పెండింగ్ బిల్లులపై కాంట్రాక్టర్లు పట్టు వీడకపోవడంతో ఆర్అండ్బీ పరిధిలో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. 8లో



కాలేజీల్లో వసతుల కల్పన

జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వసతుల కల్పన, మరమ్మతు పనులు చకచకా కొనసాగుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం

31° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఆధ్వర్యాన 'యాత్రాదానం'

సత్తుపల్లిటౌన్: టీజీ ఆర్టీసీ ఆధ్వర్యాన 'యాత్రాదానం' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. సత్తుపల్లిలో గురువారం ఆమె మాట్లాడుతూ సాంస్కృతిక విలువల పరిరక్షణ, సమాజానికి ఇచ్చే మానవత్వపు బహుమతిలో భాగంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని ఉన్నా స్తోమత లేని అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను పంపించేలా ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చని తెలిపారు. విరాళాల ఆధారంగా బస్సులు సమకూరుస్తామని వెల్లడించారు. సత్తుపల్లి డిపో పరిధిలో బుకింగ్ కోసం డిపోలో లేదా 99592 25962, 98666 19189 నంబర్లలోసంప్రదించాలని డీఎం సూచించారు.

ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ఉద్యోగులతో సమీక్షిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. రద్దీ ప్రాంతాలలో అదనంగా సిబ్బందిని నియమించి, వాహనదారులతో అనవసర వివాదాలకు పోకుండా మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని తెలిపారు. అలాగే, బాడీవార్న్ కెమెరాల ఉపయోగం, సీసీ కెమెరాల ఏర్పాటు, జరిమానా వసూళ్లపై సమీక్షించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ సత్యనారయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు సునందకు కీర్తి పురస్కారం



సునంద

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం మామిళ్లగూడెం: ప్రముఖ రచయిత్రి, ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉరిమళ్ల సునందకు 2024 సంవత్సరానికి గాను తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఆమె ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూనే సాహిత్యంలో రాణిస్తున్నారు. ఎక్కడ పనిచేసినా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ సాహిత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. అలాగే, ఏటా తన సోదరి వురిమళ్ల పద్మజ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తున్నారు. కాగా, తెలుగు యూనివర్సిటీ ప్రకటించిన పురస్కారాన్ని త్వరలో సునంద అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు, కవులు, రచయితలు అభినందించారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

ఖమ్మంవ్యవసాయం: ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు కూడా జిల్లాలోని పలు చోట్ల వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8-30నుంచి గురువారం ఉదయం 8-30 గంటల వరకు జిల్లాలో సగటున 22.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. సత్తుపల్లి మండలంలో అత్యధికంగా 68.8 మి.మీ.వర్షపాతం నమోదు కాగా, వేంసూరు మండలంలో 57.2, పెనుబల్లిలో 56.2, కారేపల్లిలో 41.8, తల్లాడలో 40.2, చింతకానిలో 22.4, ముదిగొండలో 21.6, కామేపల్లి, రఘునాథపాలెంలో 20.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు 32 నుంచి 38 డిగ్రీల వరకు నమోదు కాగా గురువారం 28 డిగ్రీలకు పడిపోయింది. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సాదాబైనామాకు సై..

తెల్ల కాగితాలపై నమోదైన భూకొనుగోళ్ల ఒప్పందాలు ఇకపై అధికారికం కానున్నాయి. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన 106జీఓతో దరఖాస్తుదారుల ఐదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. జిల్లాలో 2020లో 1,11,443 దరఖాస్తులు అందాయి. నాటి దరఖాస్తుల కటాఫ్ తేదీ ఆధారంగానే పరిశీలించి అధికారికంగా హక్కు కల్పించనున్నారు. భూముల క్రమబద్ధీకరణపై కోర్టు స్టే తొలగిపోవడం, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో దరఖాస్తుదారులకు ఊరట కలిగించినట్లయింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

స్టే తొలగింపు, జీఓ జారీతో తప్పిన చిక్కులు

- 2020 ఏడాదిలో 1,11,443 దరఖాస్తులు
- నాటి తేదీ కటాఫ్‌గానే దరఖాస్తుల పరిశీలన
- ప్రభుత్వ నిర్ణయంతో దరఖాస్తుదారుల ఐదేళ్ల నిరీక్షణకు తెర



ఐదేళ్లు నిలిచిపోవడంతో..

భూములను రెగ్యులరైజ్ చేయడానికి గత ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో జీఓ 121 జారీ చేయగా రెవెన్యూ యంత్రాంగానికి సాదాబైనామా దరఖాస్తులు వెల్లువలా అందాయి. అయితే, 2020 ఆర్వోఆర్ చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు లేనందున కోర్టు స్టే విధించింది. అప్పటి నుంచి వేలాదిమంది నిరీక్షిస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టంలో కూడా అధికంగా సాదాబైనామాల క్రమబద్ధీకరణకే దరఖాస్తులు అందాయి. ఇటీవల స్టే తొలగించడంతోపాటు ప్రభుత్వం 106 జీఓను విడుదల చేయగా దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

హక్కులు లేక అవస్థ

పట్టేదారు పాస్ పుస్తకం ఉన్న భూములకు రుణాలు అందడమే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. అలాగే పంటల అమ్మకం, విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల సమయంలోనూ ఒక్కోసారి పట్టాదారు పాస్ పుస్తకాలు కీలకంగా మారుతున్నాయి. కానీ వేలాది మంది రైతులు భూముల క్రయవిక్రయాలను తెల్లకాగితాలపై చేసుకోవడంతో పాస్ పుస్తకాలు లేక, అధికారిక భూహక్కులు దక్కక ప్రభుత్వపరంగా పథకాలకు దూరమవుతున్నారు.

ఆ కటాఫే ప్రామాణికం

స్టే తొలగించినా.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేక సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఏ ప్రాతిపదికత తీసుకుంటారో స్పష్టత రాలేదు. కానీ బుధవారం జీఓ 106 విడుదల చేసింది. దీని ప్రకారం 2014కు పూర్వం సాదాబైనామాల ద్వారా క్రయవిక్రయాలు చేయడంతోపాటు 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు ప్రభుత్వానికి అందిన దరఖాస్తులను పరిష్కరించనున్నారు. అయితే, గత 12ఏళ్లు భూమి తమ స్వాధీనంలోనే ఉన్నట్లు దరఖాస్తులు ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది.

రెవెన్యూ సదస్సుల్లోనూ..

ధరణి స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురాగా భూసమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో మొత్తం 75,004 దరఖాస్తులు అందగా, వీటిలో సాదాబైనామాపైనే 45,254 ఉన్నాయి. వీటిలో 2020లో చేసుకున్న వారిని గుర్తించేలా వడబోయనున్నారు. ప్రభుత్వ జీఓలో 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు చేసుకున్న దరఖాస్తులనే పరిష్కరిస్తామని స్పష్టం చేసింది. సెక్షన్ 6ను అనుసరించి ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు వీలులేదు. అయితే, కటాఫ్ తేదీ తర్వాత సాదాబైనామాపై అందిన దరఖాస్తుల పరిశీలనపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం వెలువరించలేదు.

2022లో అందిన మొత్తం, కొన్ని మండలాల్లో వచ్చిన దరఖాస్తులు

మొత్తం	1,11,443
పెనుబల్లి మండలం	14,333
కల్లూరు	8,314
కొణిజర్ల	7,846
తిరుమలాయపాలెం	7,607
కూసుమంచి	7,193
వేంసూరు	6,791
కారేపల్లి	6,681
ఖమ్మం అర్బన్	1,510
మధిర	1,602
సత్తుపల్లి	2,763

నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ ..



సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. 2014కి ముందు తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన ఐదెకరాల లోపు కుష్కీ, రెండున్నర ఎకరాల తరి ఉన్న చిన్న, సన్నకారు రైతుల భూములు క్రమబద్ధీకరిస్తాం. మున్సిపల్ ప్రాంతాలు తప్ప మిగతా చోట్ల ఈ ప్రక్రియ కొనసాగుతుంది. 2020లో దరఖాస్తులు ఇచ్చి.. మరోసారి రెవెన్యూ సదస్సుల్లోనూ ఇచ్చిన వారికి గతంలోనే నోటీసులు ఇచ్చాం. 2020 కటాఫ్ తేదీ ప్రకారమే దరఖాస్తుల పరిశీలన ఉంటుంది.

– పి.శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

అటవీ సంపద రక్షణ అందరి బాధ్యత

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ అనుదీప్



మౌనం పాటిస్తున్న కలెక్టర్ అనుదీప్, డీఎఫ్ఓ సిద్ధార్థ్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: అటవీ సంపద, అడవుల సంరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరిస్తే అటవీ అమరవీరులకు నివాళులర్పించినట్లవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మంలోని అటవీ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించాక కలెక్టర్ మాట్లాడుతూ తాను భద్రాద్రి కలెక్టర్‌గా ఉన్న సమయాన అటవీ అధికారి శ్రీనివాసరావు మృతి చెందడం కలచివేసిందని తెలిపారు. అటవీ ఉద్యోగులు అడవుల పరిరక్షణకు రాత్రీపగలు పనిచేస్తున్నారని అభినందించారు. అడవుల నరికివేతతో మానవ మనుగడ కష్టమవుతుందనే విషయాన్ని అందరూ గుర్తించి ఉద్యోగులకు అండగా నిలవాలని సూచించారు. డీఎఫ్ఓ సిద్ధార్థ్ మాట్లాడుతూ అటవీ సంరక్షణను బాధ్యతగా కాక ప్రజలు కర్తవ్యంలా భావించాలని తెలిపారు. అనంతరం ఉద్యోగులకు రెయిన్ కోట్లు, స్టిక్ గార్డ్‌లు పంపిణీ చేయగా కమాండ్ కంట్రోల్ సెంటర్, సీసీ కెమెరా పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన వివిధ శాఖల ఆధ్వర్యాన జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు ఆలస్యమైతే నిర్మాణ వ్యయం పెరుగుతుందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. జిల్లాకు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలపై సూచనలు చేసిన కలెక్టర్.. కొన్ని పనులు ప్రారంభం కాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, రఘునాథపాలెం మండలంలో చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్, సత్తుపల్లి, మధిర, పాలేరులో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో పనులు మొదలుకాకపోతే వాటిని రద్దు చేయాలని తెలిపారు. అలాగే, చెక్‌డ్యాంలు, సీతారామ ఎత్తిపోతల పథకం పనులపై కలెక్టర్ సమీక్షించారు. సీపీఓ ఏ.శ్రీనివాస్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, ఎస్ఈలు యాకోబు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ఆర్థిక భద్రత అవసరం

ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న చిన్మయ్‌కుమార్

కూసుమంచి: ప్రస్తుత తరుణాన అందరికీ ఆర్థిక భద్రత అవసరమని, ఇందుకోసం పొదుపు మార్గాన్ని ఎంచుకోవాలని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ మేనేజర్ చిన్మయ్‌కుమార్ సూచించారు. కూసుమంచి మండలం నేలపట్లలో ఎస్‌బీఐ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జన సురక్ష ప్రచార శిబిరం, ఆర్థిక అక్ష్యరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండి, డబ్బు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడాలన్నారు. ఈవిషయంలో అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇదేసమయాన సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు వివరిస్తున్నామని చెప్పారు. ఎస్‌బీఐ డీజీఎం కస్తూరి వినోద్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా ఆర్థిక సేవలే కాకుండా ప్రజలను అక్ష్యరాస్యులుగా తీర్చిదిద్దడం, పేద పిల్లల చదువుకు తోడ్పాటు కోసం స్కాలర్‌షిప్ ఇస్తున్నామని తెలిపారు. డీఆర్డీఓ ఏపీడీ జయశ్రీ, ఆర్‌బీఐ ఎల్‌డీఓ చేతన్ గోనేకర్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, కూసుమంచి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించడమే నేరమా?

ఏపీలో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛపై ఉక్కుపాదం ● అక్కడి ప్రభుత్వ తీరును తప్పుపడుతున్న పలువురు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛపై అక్కడ టీడీపీ ఆధ్వర్యాన అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గడిచిన మే నెలలో 'సాక్షి' దినపత్రిక విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, మంగళగిరి, రాజమండ్రి, ఏలూరు, శ్రీకాకుళం జిల్లా కార్యాలయాలపై టీడీపీ శ్రేణులు మూకదాడులకు దిగాయి. ఈ విషయంలో దోషులను శిక్షించాలని 'సాక్షి' జర్నలిస్టులు పోలీస్‌స్టేషన్లలో లిఖిత పూర్వక ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదు. ఇదే సమయాన ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, మోసాలపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు, కార్మికులు, మహిళలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల పక్షాన వార్తల రూపంలో ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై కొందరు ఉద్యోగులతో ఫిర్యాదులు ఇప్పిస్తూ తక్షణమే కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వివిధ అంశాలపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏర్పాటుచేసే ప్రెస్ కాన్ఫరెన్స్‌ల వార్తలు రాసిన 'సాక్షి' దినపత్రికతో పాటు ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని దాడులు, కేసులు, పోలీసులతో కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లలో తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ, ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కేస్తున్న ఏపీ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను పలువురు తప్పుపడుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్

జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా..



ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా కుట్ర జరుగుతోంది. జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్కడి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. జర్నలిస్టులను ఏదోలా లోబర్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఏపీలో సాక్షిపై, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయి. ఆధారాలు లేకున్నా సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై అక్కడి ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరించడాన్ని మానుకోవాలి.

– కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకం. ప్రభుత్వాలు – ప్రజలకు మధ్య వారధిలా పత్రికలు పని చేస్తుంటాయి. అలాంటి పత్రికల్లో వచ్చే కథనాలను జీర్ణించుకోలేక ఎడిటర్లపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. తక్షణమే సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి, జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

– పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

జర్నలిస్టుల హక్కులపై ఉక్కుపాదం



చంద్రబాబు ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోంది. కక్షగట్టి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం అన్యాయం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన జర్నలిజం, జర్నలిస్టుల హక్కుల రక్షణకు పాలకులు పాటుపడాలి. అంతేతప్ప ప్రభుత్వం – ప్రజలకు వారధిగా ఉంటూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సరికాదు. ఇలాంటి ఘటనలను ఫాసిస్టు చర్యగా భావిస్తున్నాం.

– ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), జిల్లా అధ్యక్షుడు

కేసులతో నియంత్రించలేరు..



కేసులతో మీడియాను నియంత్రించలేమనే విషయాన్ని అధికార వర్గాలు గుర్తించాలి. వార్తలు ఇష్టం లేకపోతే పాత్రికేయులపై కేసుల నమోదు కొనసాగుతోంది. అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీయడమే మూల సూత్రంగా పనిచేసే మీడియాను ఇబ్బంది పెడితే భవిష్యత్ పరిణామాలు అనుభవించక తప్పదు.

– ఏనుగు వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు

మీడియా గొంతు నొక్కడం సరికాదు



అధికారంలో ఉన్నవారు భావ ప్రకటన స్వేచ్ఛ, మీడియా గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంలో తగదు. మీడియా ప్రభుత్వానికి ఏకపక్షంగా అండగా ఉండాలని భావించడం సరికాదు. ప్రెస్‌మీట్ వివరాలతో కథనం ప్రచురించిన ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తే మీడియా స్వాతంత్ర్యం దెబ్బతింటుంది. ఇకనైనా జర్నలిస్టులపై దాడులు ఆపి మీడియా స్వేచ్ఛగా అభిప్రాయాలు ప్రకటించే వాతావరణం కల్పించాలి.

– పోటు రంగారావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి

మిర్చి సీజన్ నాటికి నిర్మాణాలు పూర్తి

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ లక్ష్మీబాయి, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి పంట సీజన్ ప్రారంభమయ్యే నాటికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మోడల్ మార్కెట్ నిర్మాణాలు పూర్తి చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఆదేశించారు. ఖమ్మం మార్కెట్‌లో రూ. 155.30 కోట్లతో నిర్మాణ పనులను అధికారులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. మిర్చి క్రయవిక్రయాలకు ఐదు షెడ్లు, రైతుల విశ్రాంతి భవనం, కార్మికులు, దడవాయిల కార్యాలయాలు, శీతల గిడ్డంగి నిర్మాణాలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమావేశమైన డైరెక్టర్ మాట్లాడుతూ రైతులు, ఉద్యోగులకు తాగునీటి సౌకర్యం కల్పించేలా ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు, విద్యుత్ లైట్ల ఏర్పాటు, డ్రెయినేజీ వ్యవస్థపై చర్చించారు. అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మణ్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

అటు మూత.. ఇటు వెత



కాల్వొడ్డులో మున్నేటి పాత బ్రిడ్జి వైపు వెళ్లకుండా ఏర్పాటుచేసిన బోర్డు

ఖమ్మంలోని కాల్వొడ్డు మున్నేరు పాత వంతెనపై రాకపోకలపై నియంత్రణ విధించారు. ఇక్కడ తీగల వంతెన నిర్మాణ పనులతో ప్రతిరోజు ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎలాంటి వాహనాలను అనుమతించబోమని అధికారులు ప్రకటించారు. ఈ సమయాన వాహనాలను కరుణగిరి బ్రిడ్జి మీదుగా మళ్లించారు. ఫలితంగా బ్రిడ్జిపై రద్దీ నెలకొని వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



నయాబజార్ సెంటర్‌లో వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు



వాహనాలతో కిక్కిరిసిన కరుణగిరి బ్రిడ్జి

క్లుప్తంగా

అనుమతి లేని మైనింగ్ కట్టడి



తవ్వకాలు చేపట్టిన చోట పరిశీలిస్తున్న ఉద్యోగులు

బోనకల్: బోనకల్ మండలంలోని లక్ష్మీపురంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్నారనే సమాచారంతో మైనింగ్, రెవెన్యూ ఉద్యోగులు గురువారం తనిఖీలు చేపట్టారు. మైనింగ్ ఇన్‌స్పెక్టర్ పాపగంటి నాగరాజు, ఆర్ఐ మైథిలి పరిశీలించి భూయజమానులతో మాట్లాడారు. అయితే, తవ్వకాలు చేపట్టిన వారికి సంబంధించి జేసీబీలు మరోచోట ఉండడంతో వివరాలు సేకరించారు. ఈమేరకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

'బీజేపీ, బీఆర్ఎస్ భూస్థాపితం బాధ్యత బీసీలదే'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తల్లాడ: రాష్ట్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లును ఆమోదించినా కేంద్రప్రభుత్వం జాప్యం చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. తల్లాడ మండలం బిల్లుపాడులో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బీజేపీతో పాటు, తమ పాలనలో బీసీలను అణచివేసిన బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేసే బాధ్యత బీసీలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడిస్తామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివతో పాటు మల్లెల శ్రీనివాస్, మర్రి ప్రసాద్, జొన్నలగడ్డ వెంకటేశ్వర్‌రావు, రుద్రాక్ష లక్ష్మణాచారి, నరసింహాచారి, వెంకటేశ్వరరావు, దీవెల వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, వీరభద్రరావు, సతీష్, గద్దం బాను, కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

14న రాష్ట్రస్థాయి మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 14న రాష్ట్రస్థాయి మహిళల వెయిట్ లిఫ్టింగ్ (ఇండియా లీగ్) పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు జరుగుతాయని అధ్యక్ష, కార్యదర్శులు శివ గణేష్, డి.వినోద్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఈ పోటీలకు క్రీడాకారులు హాజరుకానున్నారని వెల్లడించారు.

మున్సిపల్ ఉద్యోగుల పేరిట ఫోన్లు

- క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించాలని సూచన

సత్తుపల్లి: మీ ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసింది.. రెన్యూవల్ కోసం వాట్సప్‌లో పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా నగదు పంపించండి.. పది నిమిషాల్లో రెన్యూవల్ సర్టిఫికెట్ పంపిస్తాం.. అంటూ సత్తుపల్లిలో పలువురు వ్యాపారులకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తున్నారు. సత్తుపల్లికి చెందిన ఎల్.లక్ష్మణ్‌రావు, జ్యోతి, సుభాష్ తదితరులకు గురువారం ఫోన్ రావడంతో మున్సిపల్ కార్యాలయంలో ఆరా తీయగా తమకేం సంబంధం లేదని చెప్పడంతో అవాక్కయ్యారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ స్పందిస్తూ అపరిచితులు ఫోన్ చేసినా, క్యూ ఆర్ కోడ్ పంపినా స్పందించవద్దని సూచించారు. మున్సిపల్ ఉద్యోగులెవరూ ఇలా చేయరని, వ్యాపారులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



వెంకటరత్నంను అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

వైరా: జైళ్లశాఖలో హెడ్ వార్డర్‌గా పనిచేస్తున్న వైరా మున్సిపాలిటీ గండగలపాడుకు చెందిన పి.వెంకటరత్నం ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి పలువురు పోటీ పడగా, తెలంగాణ తరఫున పాల్గొన్న వెంకటరత్నం ద్వితీయ బహుమతి సాధించాడు. ఉద్యోగం సాధించకముందు వైరాలో రత్న ఆర్ట్స్ నిర్వహించిన ఆయన జాతీయ స్థాయిలో సత్తా చాటడంపై పలువురు అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

ముందు బిల్లులు ఇవ్వండి

- లేకపోతే పనిచేయలేమంటున్న కాంట్రాక్టర్లు
- నోటీసులు ఇచ్చినా కానరాని ఫలితం
- ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్డు పనులకు అంతరాయం



ఖమ్మం - ఇల్లెందు మార్గంలో రఘునాథపాలెం వద్ద మధ్యలోనే ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో రోడ్లు–భవనాల శాఖ పరిధిలో అనేక పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే రెండు, మూడు సార్లు నోటీసులు పంపినా చాలా మంది స్పందించకపోవడం గమనార్హం. అధికారులు తరచుగా నోటీసులు ఇస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం తొలుత బిల్లులు చెల్లించాలని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో జిల్లాలో కొన్ని రోడ్ల నిర్మాణం ప్రారంభం కాకపోగా.. ఇంకొన్ని పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

యంత్రాలు కూడా తరలింపు

ప్రధానంగా ఖమ్మం–ఇల్లెందు రహదారిపై రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు రూ.40 కోట్లతో నాలుగు లేన్ల రహదారి నిర్మాణం ప్రారంభమైంది. అయితే బిల్లులు విడుదల కానందున కాంట్రాక్టర్ పనులు నిలిపివేసి సామగ్రి సైతం తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో ఆ రోడ్డుపై వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. ఇల్లెందు–ఖమ్మం రోడ్డుకు సంబంధించి మరమ్మతు పనులు ఆపిన కాంట్రాక్టర్‌కు ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీ చేసినా స్పందన రాలేదని సమాచారం. సదరు కాంట్రాక్టర్ ఇప్పటివరకు చేసిన పనులకు సుమారు రూ.10కోట్ల బిల్లు రావాల్సి ఉండగా, అందులో కొంత మొత్తమైనా ఇవ్వకపోతే పనులు చేసేది లేదని చెప్పినట్లు సమాచారం.

మిగతా పనులు కూడా....

జిల్లా వ్యాప్తంగా రహదారుల వార్షిక మరమ్మతులు, గుంతల పూడ్చివేత, రోడ్లకు ఇరువైపులా కంచె చెట్ల తొలగింపు పనుల టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడం లేదు. గత రెండేళ్ల క్రితం చేసిన పనులకు బిల్లులు ఇప్పటికీ రాలేదని.. మళ్లీ పనులు చేసి అప్పులు కాలేమంటూ కాంట్రాక్టర్లు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో వార్షిక పనులు, చిన్న గుంతలు పూడ్చడం, కంప చెట్లు తొలగింపు తదితర పనులన్నీ నిలిచిపోయాయి. జిల్లాలోని సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో ఏడెనిమిది మండలాల పరిధిలో పనులు పూర్తి కాగా.. మిగిలిన అన్నిచోట్ల కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఏన్కూరు మండల కేంద్రంలో రూ.3 కోట్లతో నిర్మించాల్సిన డ్రెయిన్ల పనులకు గత ఎన్నికల కంటే ముందే టెండర్ అయినా ప్రారంభం కాలేదు. దీంతో టెండర్ గడువు ముగియడం, నోటీసులకు స్పందన రాకపోవడంతో టెండర్‌ను రద్దు చేసే దిశగా అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా నిధులు మంజూరై, టెండర్లు అయిన పనులు నిలిచిపోగా.. రోడ్ల మరమ్మతులు జరగకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఖమ్మం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు తగ్గించిన మస్టర్లను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యాన కార్మికులు గురువారం ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మొదటి షిఫ్ట్‌లో రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఖమ్మం డిపోలో జరిగిన నిరసనలో జేఏసీ నాయకులు పిట్టల సుధాకర్, బూదాటి శ్రీనివాసరెడ్డి, నిమ్మటూరి సత్యం, బత్తినేని హనుమంతరావు, పగిళ్లపల్లి నరసింహారావు, గుగ్గిళ్ల రోశయ్య, బేతంపూడి బుచ్చిబాబు, నర్సింహాచారి, పద్మా, జ్యోతి, సంధ్యారాణి, ఉమారాణి, నాగవీర, భాస్కర్, లాల్‌బీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐ–2గా అప్పలనాయుడు

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ సీఐ–2గా అప్పలనాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయనను ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ సీపీ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ స్థానంలో ఉన్న సాంబశివరావును తిరిగి హెడ్‌క్వార్టర్స్‌కు కేటాయించారు. ఈమేరకు అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

'ఆశా'లకు రూ.18వేల వేతనం చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించి వారి సర్వీసును క్రమబద్ధీకరించేలోగా రూ.18వేల వేతనం చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు యూనియన్(సీఐటీయూ) జిల్లా ఏడో మహాసభ జిల్లా అధ్యక్షురాలు జె.మంగమ్మ అధ్యక్షతన గురువారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆశాల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు, పి.రమ్య, పి.మోహన్‌రావు, విఠల్, చంద్రశేఖర్, శీలం నర్సింహారావు, జిల్లా ఉపేందర్, నాయకులు నవీన్‌రెడ్డి, బషీరుద్దీన్, వీరన్న, ఆశావర్కర్ల యూని యన్ నాయకులు జె.మంగమ్మ, బి.అమల పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులకు అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ విధానంపై ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఖమ్మంలోని టీటీడీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల లింకేజీ కార్యకలాపాలు, రుణ పరిమితి, రుణబీమా, ఆర్‌బీఐ మార్గదర్శకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు కె.శ్రీనివాసరావు, నరసింహస్వామి, బాలస్వామి, డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధికారులు జయశ్రీ, నీలేష్, ఖమ్మం, ఆంజనేయులు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల్లో వసతుల కల్పన

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.2.96కోట్లు
- అక్టోబర్ 15నాటికి పూర్తిచేసేలా ప్రణాళిక



పిండిప్రోలు కాలేజీలో పనులను పరిశీలిస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పన, అవసరమైన మరమ్మతులపై దృష్టి సారించారు. ఈమేరకు జిల్లాలోని 21 కాలేజీలకు గాను 15కళాశాలల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు నివేదిక సమర్పించారు. దీంతో ప్రభుత్వం జిల్లాకు రూ.2.96 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అమ్మ ఆదర్శ కళాశాలల కమిటీల ద్వారా పనులు చేపడుతున్నారు.

'అమ్మ' కమిటీల ద్వారా..

ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో చేపట్టిన పనులన్నింటినీ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యాన చేపట్టారు. కళాశాలల్లోనూ అదే మాదిరి పర్యవేక్షణకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలను నియమించారు. ఈ కమిటీల ద్వారా పనుల పర్యవేక్షణ కొనసాగుతోంది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పనులు చేపడుతుండగా, కమిటీలతో పాటు గ్రామీణ ప్రాంత కళాశాలల్లో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లోనైతే మున్సిపల్ కమిషనర్లు, విజిలెన్స్ ఆఫీసర్లు, రిసోర్స్ పర్సన్లు పర్యవేక్షిస్తున్నారు. కాగా, ఈ పనులన్నీ అక్టోబర్ 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

15 కళాశాలల్లో పనులు..

రూ.2.96 కోట్ల నిధులతో జిల్లాలోని 15 జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పనులు కొనసాగుతున్నాయి. కళాశాలల్లో అవసరమైన చిన్న చిన్న మరమ్మతులతో పాటు టాయిలెట్ల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పన, సైన్స్ ల్యాబ్‌ల్లో సామగ్రి కొనుగోలు, రంగులు వేయించేందుకు ఈ నిధులు వెచ్చిస్తున్నారు. కాగా, జిల్లాలోని 15 కాలేజీలకు నిధులు మంజూరు కాగా.. అత్యధికంగా కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.30లక్షలు మంజూరయ్యాయి. అలాగే, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.28.6 లక్షలు, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు జూనియర్ కాలేజీకి రూ.26 లక్షలు, కారేపల్లి కళాశాలకు రూ.20.5 లక్షలు కేటాయించారు.

నిరంతరం పర్యవేక్షణ



జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అన్ని పనులు అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని నిర్ణయించాం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కాలేజీల్లో అవసరాలను గుర్తించి నిధులు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించాం.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

నేడు స్ట్రక్చరల్ సమావేశం

సింగరేణి లాభాల వాటాపై చర్చించే అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం 2024–25 ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల్లో కార్మికులకు చెల్లించే వాటాపై చర్చించనున్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్, మెడికల్ బోర్డ్ వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి. సింగరేణి సంస్థ 2023–24లో 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రూ.2,412 కోట్ల నికర లాభం ఆర్జించింది. కార్మికులకు 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లు పంపిణీ చేసింది. ఈసారి లాభాల వాటాను 35 శాతానికి పెంచాలని గుర్తింపు కార్మిక సంఘం పట్టుబట్టినట్లు తెలిసింది. శుక్రవారం జరిగే సమావేశంలో ఒప్పందం కుదిరితే రానున్న 10 రోజుల్లో లాభాలా వాటా, చెల్లింపు తేదీనీ ప్రకటించే అవకాశం ఉంది. దసరా పండుగకు పది రోజులు ముందే లాభాల వాటా చెల్లించడం ఆనవాయితీ. అక్టోబర్ 2న దసరా పండుగ జరుపుకోనుండగా పది రోజుల్లో లాభాల వాటా అకౌంట్లలో జమ అవుతుందని కార్మికులు భావిస్తున్నారు. కాగా, 1998 నుంచి సింగరేణి యాజమాన్యం కార్మికులకు లాభాల వాటా చెల్లిస్తోంది. మొదటిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 శాతం వాటా చెల్లించారు.

చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు..

సాయుధ పోరాట వారోత్సవాలను ప్రారంభించిన బాగం

ఖమ్మంమయూరిసెంటర్: చరిత్రను వక్రీకరించాలని ఎవరు యత్నించినా తెలంగాణ జాతి క్షమించదని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బీజేపీ యత్నిస్తోందని.. కానీ స్వాతంత్య్ర ఉద్యమం, తెలంగాణ పోరాటంలో బీజేపీకి ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను గురువారం ఖమ్మంలో నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం హేమంతరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చాక నిజాం స్వాతంత్ర రాజుగా ప్రకటించుకుంటే రావి నారాయణరెడ్డి, ముగ్దుం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాటంలో సామాన్యులు సాయుధులై ముందుకు సాగారని, నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని చెప్పారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ఈ పోరాటంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారని తెలిపారు. అయితే, సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలనే విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే వైఖరితో ఉండటం దురదృష్టకరమన్నారు. ఈమేరకు నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేలా సీపీఐ ఆధ్వర్యాన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బాగం తెలిపారు. తొలుత అంబేడ్కర్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, కార్పొరేటర్ బీజీ.క్లెమెంట్‌తో పాటు మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నల్లమల గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కల్లూరు రూరల్: కల్లూరు మండలం తెలగవరం మర్లపాడు క్రాస్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిన్నకోరుకొండికి చెందిన జూపల్లి లక్ష్మీనర్సు(65) తెలగవరం మర్లపాడు నుండి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమాన కల్లూరు నుంచి మధిర వైపు వెళ్తున్న మధిర డిపో బస్సు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన లక్ష్మీనర్సు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కల్లూరు ఎస్సై డి.హరిత దర్యాప్తు చేపట్టారు.

గుంతలో నగలు.. అవసరమైతే అమ్మకం

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



నిందితుడు, చోరీ సొత్తుతో పోలీసులు

ఖమ్మంక్రైం: జైలుకు వెళ్లివచ్చినా తీరు మార్చుకోకుండా రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి చోరీ సొత్తు గుంతలో దాచి అవసరమైనప్పుడు అమ్ముతూ విలాసవంతమైన జీవనం సాగిస్తున్నాడు. ఈమేరకు నిందితుడిని ఖమ్మం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేయగా వివరాలను గురువారం వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన ఆటోడ్రైవర్ నాగేల్లి వరకుమార్ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి చోరీల బాట ఎంచుకున్నాడు. రైళ్లల్లో ప్రయాణిస్తూ, ప్లాట్‌ఫాంపై తిరుగుతూ ఆదమరిచి ఉండే ప్రయాణికుల వద్ద చోరీకి పాల్పడుతున్నాడు. గతంలో ఓసారి జైలుకు వెళ్లి వచ్చినా మార్పు రాలేదు. ఖమ్మం స్టేషన్‌లో గురువారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వరప్రసాద్‌ను అదుపులోకి తీసుకోగా చోరీల విషయం బయటపడింది. దీంతో ఆయన నుంచి 10గ్రాములు బంగారు నెక్లెస్ స్వాధీనం చేసుకున్నారు. తొలుత చోరీ నగలపై ఆరా తీయగా ఇంట్లో దాచినట్లు వరప్రసాద్ చెప్పినా దొరకలేదు. తిరిగి తోతుగా విచారించడంతో ఇంటి వెనుక గుంతలో పెట్టినట్లు ఒప్పుకున్నాడు. డబ్బు అవసరమైనప్పుడు ఒక్కో ఆభరణం తీసి అమ్ముతున్నట్లు అంగీకరించాడు. ఇప్పటివరకు వరప్రసాద్ చోరీ చేసిన సొత్తు విలువ రూ.8.50లక్షలు ఉంటుందని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు అంజలి, సురేష్‌గౌడ్ తెలిపారు. ఈసమావేశంలో ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిండా ముంచిన కల్తీ విత్తనాలు?

పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య



వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

వేంసూరు: కల్తీ విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు కంపెనీ యాజమాన్యం న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. వేంసూరు మండలం కందుకూరుకు చెందిన పలువురు రైతులు కరీంనగర్‌కు చెందిన వరుణ్ కంపెనీ బీపీటీ 2782 రకం వరి విత్తనాలతో 1,500 ఎకరాల్లో పంట సాగు చేశారు. అయితే, 120 రోజుల్లో ఈతకు రావాల్సిన వరి 90 రోజులకే 40 శాతం మేర ఈనడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన పొలాలను గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర పరిశీలించి మాట్లాడారు. సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తోందని భరణిపాడు, మర్లపాడు, లింగపాలెం, కుంచపర్తి, చౌడవరం గ్రామాల రైతులు వరి సాగు చేశారని తెలిపారు. కానీ విత్తన లోపంతో ఒక కందుకూరులోనే 1,500 ఎకరాల్లో నష్టపోయారని చెప్పారు. అధికారులు, కంపెనీ ప్రతినిధులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, పాల వెంకటరెడ్డి, పగట్ల వెంకటేశ్వరరావు, జుబ్బూరి నాగరాజు, దొడ్డ వెంకటకృష్ణారెడ్డి, మండపాటి మహేశ్వరరెడ్డి, గొర్ల సత్యనారాయణరెడ్డి, ఎర్ర రమేష్, గండ్ర రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గుంతలో పడి వ్యక్తి మృతి



జమలయ్య (ఫైల్)

మధిర: రోడ్డు పక్కన ఉన్న లోతైన గుంతలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మధిర హనుమాన్ కాలనీకి చెందిన ఉప్పతల జమలయ్య(45) బోనకల్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇనుప బీరువాల తయారీ పనిచేస్తున్నాడు. బుధవారం ఆయన మధిర వడ్డెర కాలనీలో ఫంక్షన్‌కు హాజరై తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబీకులు గాలిస్తుండగా గురువారం ఉదయం గుంతలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్న క్రమాన మద్యం మత్తులో రోడ్డు పక్కన నీటి గుంతలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే, సెల్‌ఫోన్‌తో పాటు నగదు రోడ్డుపై ఉండడంతో మద్యం మత్తులో పడ్డాడా, ఇతర కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మధిర టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తిరుమలాయపాలెం/రఘునాథపాలెం: తిరుమలాయపాలెం మండలం ఎదుళ్ల చెరువులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో గురువారం టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రఘు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.30,520 నగదు, కారు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేశారు. అలాగే, రఘునాథపాలం మండలం కొర్లబోడు తండాలోనూ తనిఖీలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట ఆడుతున్న ముగ్గురు అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారు కాగా, పట్టుబడిన వారి నుంచి రూ.20వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

సాగర్ కెనాల్‌లో మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం వేణుగోపాల్ నగర్ వద్ద సాగర్ కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని గుర్తించారు. తెలుపు, నలుపు అడ్డగీతల టీషర్ట్, కాటన్ ప్యాంట్‌తో ధరించిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిందని ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించినట్లు సీఐ బాలకృష్ణ వెల్లడించారు.